క్లుప్తంగా

పక్కాగా ఓటరు సర్వే



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుత్తి రూరల్: ఓటరు సర్వే బీఎల్ఓలు పక్కాగా చేపట్టాలని ఆర్డీఓ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీపీఓ, ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రభాకరరావుతో కలసి ఆర్డీఓ బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రవీంద్ర మాట్లాడుతూ బీఎల్ఓలు ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్తూ ఓటరు జాబితాను విచారణ చేయాలన్నారు. తప్పుల తడకగా ఓటరు జాబితా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి కారణం లేకుండా ఓట్లను తొలగించవద్దన్నారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, ఇన్చార్జ్ ఎంపీడీఓ శివాజీరెడ్డి, కమిషనర్ శ్రీనివాసులు, సీఎస్డీటీ సూర్యనారాయణ, డీటీ లలిత, ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు పరిశీలన



ఆధార్ అప్డేట్ రసీదును అందిస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

పుట్లూరు: మండలంలోని కందికాపుల గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు శిబిరాన్ని ఎంపీడీఓ యోగానందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. పదేళ్లుగా ఆధార్ అప్డేట్ చేసుకోని వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

బుక్కరాయసముద్రం: రేకులకుంట గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ విజయభాస్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆధార్ కేంద్రానికి రోజూ ఎంత మంది వస్తున్నారు, ఏఏ రకాల సేవలు పొందుతున్నారని సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అంతకముందు ఆయన సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వైఎస్సార్ పాల వెల్లువ సర్వేను పరిశీలించారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న ఏడీజే శ్రీనివాసులు

గుత్తి: పట్టణంలోని ఏడీజే కోర్టులో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏడీజే శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఏడీజే కోర్టులో శుక్రవారం సాయంత్రం పోలీసు అధికారులు, ప్యానెల్ లాయర్లు, బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్లో రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి దీప్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిదనవాడలో ఎమ్మెల్యే పర్యటన

శింగనమల: నిదనవాడలో శనివారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పర్యటిస్తున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష కింద రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం



బీసీ హాస్టల్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్.జగన్మోహన్రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. 2016లో గుంతకల్లులో మూతబడిన ప్రభుత్వ బీసీ బాలుర(డీఎన్టీ) హాస్టల్ ఎమ్మెల్యే చొరవతో పునఃప్రారంభమైంది. పాతగుంతకల్లులోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ పక్కన అద్దె భవనంలో ఏర్పాటు చేసిన బీసీ(డీఎన్టీ) బాలుర హాస్టల్ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదపిల్లలందరూ చదవాలి..వారంతా ఉన్నతంగా ఎదగాలన్నదే జగనన్న సంకల్పమన్నారు. ఏపీ విద్యారంగంలో విశిష్ట పథకాలను ప్రవేశపెట్టిన జగనన్న ప్రీప్రైమరీ నుంచి విదేశీ ఉన్నత విద్యనభ్యసిస్తున్న పేదపిల్లలకు చేయూతనందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కొఠారి మాట్లాడుతూ ఎమ్మెల్యే వైవీఆర్ పట్టుదలతోనే హాస్టల్ను ప్రారంభించామన్నారు. 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు హాస్టల్లో చేరాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేను బీసీ వెల్ఫేర్ డీడీ, ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, వార్డెన్ నాగమణి శాలువా, పూలమాలతో సత్కరించారు. కౌన్సిలర్లు రవీంద్ర, నాగరత్నమ్మ, లింగన్న, జెడ్పీటీసీ కదిరప్ప, మున్సిపల్ మాజీచైర్మన్ రామలింగప్ప, వైఎస్సార్సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు వంశీయాదవ్, వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్ ఉన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

- వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వైవీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్



హాజరైన జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు

గుంతకల్లుటౌన్: సంక్షేమసారథి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఈద్గా ఫంక్షన్ హాల్లో 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలకు చెందిన జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోను ఓ పవిత్ర గ్రంథంలా భావించిన సీఎం జగన్ నాలుగేళ్లలోనే 99 శాతం హామీలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థిక పరిస్థితి, జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన జగనన్నే మా నమ్మకం అని ప్రజలే నినదిస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, మహిళా సాధికారతతో పాటు నవతరం సంస్కరణలతో జనరంజక పాలన సాగిస్తున్న జగన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా వారి సమస్యలను పార్టీ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అధికారం కోసం అసాధ్యపు హామీలను గుప్పిస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న చంద్రబాబు, పవన్కళ్యాణ్ మోసాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఓటరు నమోదులో ముందంజలో ఉండాలని, అలాగే దొంగ ఓట్లు చేర్పిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథుల భద్రతకై పార్టీ బీమా సౌకర్యాన్ని కల్పిస్తుందని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం సైనికుల్లా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీ 175కు 175 స్థానాల్లో గెలిపించేందుకు పాటుపడాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు, గుత్తి మున్సిపల్ చైర్పర్సన్లు ఎన్.భవాని, వన్నూర్బీ, వైస్ చైర్పర్సన్లు నైరుతిరెడ్డి, వరలక్ష్మి, మూడు మండలాల ఎంపీపీలు మాధవి, విశాలాక్షి, మురళీరెడ్డి, జెడ్పీటీసీలు ప్రవీణ్యాదవ్, మధుసూదన్రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, పార్టీ గుంతకల్లు అధ్యక్షుడు బి.సుంకప్ప, మూడు మండలాల సచివాలయాల కన్వీనర్లు జింకల రామాంజినేయులు, ఎండీ.ఖలీల్, గోవింద్నాయక్, రంగస్వామి, సుభాష్రెడ్డి, ఆసీఫ్, కుమార్రెడ్డి, నియోజకవర్గం సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, పామిడి చెన్నకేశవరెడ్డి, మల్లికార్జునశాస్త్రి, యుగంధర్రెడ్డి, భీమలింగప్ప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయ పునర్నిర్మాణానికి రూ.కోటి మంజూరు

పామిడి: పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి కామన్ గుడ్ ఫండ్ నుంచి ఆలయ పునర్నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించడంతో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల నుంచి రూ.40 లక్షలు విరాళరూపంలో అందాయని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కలిపి(రూ.1.4 కోట్లు) ఆలయ పునర్నిర్మాణం చేపడతామని ఆలయ చైర్మన్ ఎస్.మురళీధర్గుప్తా తెలిపారు .

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ, హోరబ్ చర్చి ఏరియా అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగేశ్వరి శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లల రికార్డులు, పోషణ పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, అమరజ్యోతి ఉన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

శింగనమల: వెస్ట్ నరసాపురంలో శుక్రవారం 40 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాటర్ షెడ్ నిధులతో పంచాయతీ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశామని వాటర్షెడ్ చైర్మన్ పట్నం నగేష్ తెలిపారు. డీలర్ మల్లికార్జున రెడ్డి, వాటర్షెడ్ ఏఈ శ్రీనివాస రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ గంగాధర తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కసాపురం తూము వద్ద కృష్ణా జలాలకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు గుంతకల్లుకు చేరిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆయా గ్రామాల నాయకులతో కలిసి కసాపురం వద్ద నున్న హంద్రీ–నీవా తూము వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తూము నుంచి గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువుకు నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరువు జిల్లా అయిన అనంతకు కృష్ణా జలాలను తీసుకొచ్చి రైతులకు ఊపిరి పోసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందన్నారు. ఆయన కృషి వల్లనే నేడు అనంతలో తాగు, సాగునీటి కష్టాలు తీరిపోయాయన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి రైతు శ్రేయస్సుకోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని ప్రజలు ఎన్నటికీ గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కసాపురం సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, పాతకొత్తచెరువు ఎంపీటీసీ వెంకటరెడ్డి, పాతకొత్తచెరువు సర్పంచ్ మజ్జిగ మల్లికార్జున, సింగిల్ విండో ప్రెసిడెంట్ సుంకిరెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, పోలింగ్ మండల కన్వీనర్ రాము, దశరథ, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, పాతకొత్తచెరువు, వైటీ చెరువు, కసాపురం గ్రామాల రైతులు, పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దపీట



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటంతో ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు మహిళలు

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి పేర్కొన్నారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ 4వ విడత జమ చేసిన సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు సొసైటీ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేశారు. ముందుగా మహిళా సంఘాల సభ్యులు, లీడర్లు వైకేపీ కార్యాలయం నుంచి సొసైటీ కార్యాలయం వరకు సీఎం చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. సంఘాల ద్వారా ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేలా చర్యలు చేపడుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాల రుణాలను 4 విడతల వారీగా మాఫీ చేస్తానని చెప్పి చేసి నిరూపించారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళా సంఘాల సభ్యులను నమ్మించి మోసం చేశారన్నారు. మండలంలో 4వ విడత సున్నా వడ్డీ డబ్బు 1,350 సంఘాలకు గాను 1.90 కోట్ల రుపాయల అకౌంట్లలోకి జమ చేశారన్నారు. చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, కార్యదర్శి మాధవి, కోశాధికారి విజయలక్ష్మి, ఉప కార్యదర్శి నాగలక్ష్మి, ఈసీ సభ్యులు, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, వైఎస్సార్సీపీ నేత చికెన్ నారాయణస్వామి, మహిళా నేత మనేరి కొండమ్మ, సాకే లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహకాలు

యల్లనూరు: ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు ప్రోత్సహకాలు అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ఏపీడీ వెంకటరత్నం సూచించారు. యల్లనూరు, నిట్టూరు గ్రామాల్లో సాగు చేసిన పండ్లతోటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పండ్లతోటల సాగునుపెంచాలన్నారు. మండలంలో 106 మంది రైతులు సుమారు 410 ఎకరాల్లో చీనీ, దానిమ్మ పంటలను సాగు చేసుకుంటున్నారన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ షబ్బీర్బాషా, ఏపీడీ అసిస్టెంట్ నరేంద్ర, ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పుట్లూరు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డ్వామా ఏపీడీ వెంకటరత్నం హెచ్చరించారు. శుక్రవారం ఆయన గాండ్లపాడు, తక్కళపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో ఉన్న కూలీల వివరాలను ఆరా తీసి మస్టర్లను పరిశీలించారు. వర్షాలు లేకపోవడం వల్ల ఉపాధి పనుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పనులను కల్పించనున్నట్లు ఆయన వివరించారు. సాంకేతిక సహాయకులు నరేంద్ర, విజయ్, క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్లు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టండి

యల్లనూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ఎస్ఐ రామకృష్ణకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్స్టేషన్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాట వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మండల పరిస్థితులపై ఎస్ఐను అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



గుత్తి: వాసవీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శుక్రవారం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వర మహాలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు వాసుదేవి శర్మ అమ్మవారి మూల విరాట్ను ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, కాగడా హారతి వంటి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు ప్రదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్ష , కార్యదర్శులు రాచమడుగు ఉమాదేవి, రాచమడుగు భాగ్యవతి, యువజన సంఘం అధ్యక్షుడు తాయి వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని సరస్వతీ ఉన్నత విద్యామందిరం, నిట్టూరు నిలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వరలక్ష్మీ మాత చిత్రపటాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి వ్రతం ఆచరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి ఆనందకుమార్శర్మ మహిళలతో వ్రతం చేయించారు. ఈ సంవత్సరం వర్షాలు వచ్చేలా చూడాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి, కాళికమాత, దుర్గాభవానీ, సుంకులమ్మ, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మస్తాన్పేట మారెమ్మ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల గాజులతో అందంగా అలంకరించి పూజలు జరిపించారు. మహిళలు అమ్మవార్ల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



వేములపాడులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు.



నగరూరు గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా సంక్షేమ పాదయాత్ర కొట్టాలపల్లెలో ప్రారంభమై వేములపాడు క్రాస్, వేములపాడు, నగరూరు వరకు సాగింది. వేములపాడు క్రాస్ వద్ద ఎమ్మార్పీఎస్ నేత పుల్లయ్య, డీలర్ ఆది, కుళ్లాయప్ప, రామాంజనేయులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. యాత్ర వేములపాడుకు చేరుకోగానే సర్పంచు ఓంకారమ్మ, మాజీ సర్పంచు వీకే ప్రదీప్రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. రైల్వే గేట్ సమీపంలో జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రంగనాథరెడ్డి, లక్షుంపల్లె బాలిరెడ్డి, ఉపేంద్ర గౌడ్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. నగరూరులో సర్పంచు రుక్మాంద రెడ్డి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాగేంద్రరెడ్డి, డీలర్ ఆదినారాయణ రెడ్డి, మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయులు కేతిరెడ్డి హర్షవర్ధన్రెడ్డి, కేతిరెడ్డి సాయి ప్రతాప్రెడ్డి, ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, మార్కెట్యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లు హరినాథరెడ్డి, ఓబులరెడ్డి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, బాలా రమేష్బాబు, యాడికి, లక్షుంపల్లె, తూట్రాళ్లపల్లె సర్పంచులు అనురాధ, పద్మనాభరెడ్డి, సంజీవరాయుడు, యాడికి, రాయలచెరువు, గుడిపాడు ఉప సర్పంచులు, కాసా చంద్రమోహన్, ప్రవీణ్ యాదవ్, శ్రీనివాసులు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్రెడ్డి, పాశం రంగస్వామి యాదవ్, నాయకులు అమర్నాథరెడ్డి, రమానందరెడ్డి, రసూల్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్హెల్త్ క్లినిక్ ప్రారంభం

నగరూరు సమీపంలో రూ.97.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సమీపంలో దాదాపు రూ.10 లక్షలు విలువ చేసే 76 సెంట్ల స్థలాన్ని గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్లను నిర్మాణానికి తమ తండ్రి వెలుగు చౌడప్ప జ్ఞాపకార్థం ఉచితంగా ఇచ్చిన చౌడప్ప కుమారులు గంగన్న, శ్రీరాములు, బలరాముడు, కృష్ణమూర్తిని ఎమ్మెల్యే అభినందించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

రెండు వారాల క్రితం రామరాజుపల్లెకు చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త బాలయ్య భార్య నాగరత్న రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకు ఆపరేషన్ చేయించుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నగరూరులో బాధితురాలి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో శుక్రవారం బైక్పై నుంచి జారి కింద పడి ప్యాపిలి మండలం గుడిపాడుకు చెందిన రంగనాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని గుత్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

గుంతకల్లు టౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు పక్కన పేకాట ఆడుతున్న 13 మందిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. నిందితుల నుంచి రూ.14,500 నగదు, 7 బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై ఏపీ గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు ఆత్మహత్య



మృతుడు లక్ష్మీనారాయణ

నార్పల: మండల కేంద్రానికి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు..మసీదుకట్ట కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ(47) తనకున్న మూడెకరాల పొలంలో నాలుగేళ్ల నుంచి వివిధ రకాల పంటలు సాగు చేశాడు. పంటలు చేతికి రాకపోవడంతో దాదాపు రూ.12 లక్షలు అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మథనపడుతుండేవాడు. ఈక్రమంలో శుక్రవారం పొలంలో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించుకుని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

చంద్రబాబు, లోకేష్పై చర్యలు తీసుకోవాలి



గుంతకల్లు రూరల్: ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్సీపీ సోషల్ మీడియా సభ్యులు

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ సోషల్ మీడియా సభ్యులు కోరారు. ఈమేరకు సోషల్ మీడియా కో కన్వీనర్ చిన రాయుడు, సభ్యులు అశోక్, విష్ణ్వేశ్వరగౌడ్, షబ్బీర్బాషా, వినోద్ కుమార్ శుక్రవారం రూరల్ ఎస్ఐ సురేష్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీకి చెందిన ఏ కార్యకర్త మీద అయితే ఎక్కువ కేసులు ఉంటాయో వారికే నామినేటెడ్ పోస్టులను కట్టబెడతామంటూ మభ్యపెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రేరేపిస్తున్నారన్నారు.

యాడికి: రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్న నారా లోకేష్పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ ఫరూక్, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, చౌదరి తదితరులు శుక్రవారం ఏఎస్ఐ వెంకటేష్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారన్నారు. పోలీసులు లోకేష్పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గుత్తి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో–కన్వీనర్లు కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కో–కన్వీనర్ వరదరాజులు, మండల కన్వీనర్ గాదిలింగేశ్వర బాబు(జగన్), కో–కన్వీనర్లు కరిడికొండ శివ, దేవేంద్ర(దేవా), సచివాలయ కన్వీనర్లు శివప్రసాద్, ప్రకాష్, జగదీష్ శుక్రవారం సాయంత్రం సీఐ వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు చేశారు.

పెద్దవడుగూరు: టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న టీడీపీ నేత నారా లోకేష్పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తాడిపత్రి సోషల్ మీడియా కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం నారా లోకేష్పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దవడుగూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా సభ్యులు వెంకటేశ్వరెడ్డి, హరీష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగకు రక్షక తడులు అవసరం

బుక్కరాయసముద్రం: వేరుశనగ పంటకు రక్షణ తడులు ఎంతో అవసరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డిపల్లి కేవీకేలో వేరుశనగ పంటలకు రక్షక తడులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావం కారణంగా వేరుశనగలో బెట్ట పరిస్థితి నెలకొందన్నారు. పంట ప్రస్తుతం ఊడల దశలో ఉందని, తగినంత నీటి తడులు ఎంతో అవసరమన్నారు. బెట్టను తట్టుకునేందుకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటికి లేదా లీటరు నీటికి 5 గ్రాములు 19.19.19 కలిపి పిచికారీ చేయాలన్నారు. లీటరు నీటికి 5 గ్రాములు యూరియా కలిపి పిచికారి చేస్తే వేరుశనగ బెట్ట నుంచి ఉపశమనం పొందుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

డాబాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పామిడి: డాబాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్చార్జ్ సీఐ షేక్ చాంద్బాషా హెచ్చరించారు. శుక్రవారం 44 హైవేపై పామిడి–గుత్తి నడుమ ఉన్న డాబాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. డాబా నిర్వాహకులు మద్యం తాగనివ్వకుండా జాగ్రత్త పడాలని సీఐ సూచించారు.